kalamdaily.com


# కలం

ప్రజల గళం...

Follow on:
Kalamtelugu

మంగళవారం
24-03-2026

**SINGLE PAGE TOPIC**



కీలక నిర్ణయాలు.. సంచలన చట్టాలతో మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ భిన్నం. అడ్మినిస్ట్రేషన్ కోణంలోనే కాక సోషల్ జస్టిస్ స్ఫూర్తిగానూ రాష్ట్ర సర్కార్ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నది. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన మొదటి, ఏకైక రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. బీసీ కులగణన చేపట్టి అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. కేంద్రం సైతం తెలంగాణ తరహాలో కులగణనకు చొరవ తీసుకున్నది. తాజాగా ఉన్నత విద్యా సంస్థల్లో కులవివక్షకు వ్యతిరేకంగా రోహిత్ వేముల చట్టాన్ని తేవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేబినెట్ సబ్ కమిటీ చర్చించి విధివిధానాలను ఖరారు చేయనున్నది. త్వరలో చట్టం రానున్నది. దేశం చూపు తెలంగాణ వైపు... అనే తరహాలో సంచలన నిర్ణయాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నది.

ఈ మూడు నిర్ణయాలూ 'సామాజిక న్యాయం'తో ముడిపడినవే. రెండున్నరేళ్ల కింద అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఈ మూడింటి గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చారు. అందులో రెండింటికి చట్టబద్ధత లభించింది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ డిమాండ్ ఎట్టకేలకు సాకారమైంది. జిత్‌నీ ఆబాదీ.. ఉత్‌నా హక్.. అనే స్లోగన్‌కు తగినట్లుగా బీసీ రిజర్వేషన్ చట్టం అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనపై స్పందించిన రాహుల్‌గాంధీ రెండుసార్లు నగరంలో నిరసనల్లో పాల్గొన్నారు. విద్యార్థులతో మాట్లాడారు. రోహిత్ వేముల చట్టం తెస్తామని హామీ ఇచ్చారు. దీనిపై కేబినెట్ పాజిటివ్ నిర్ణయం తీసుకున్నది. త్వరలో చట్టం రానున్నది. రాష్ట్ర ప్రభుత్వ సంచలన నిర్ణయాలపై 'కలం' స్పెషల్...

- తెలంగాణ బ్యూరో, కలం

# తెలంగాణ ఫస్ట్
# సెన్సేషనల్ యాక్ట్స్

ఎస్సీ వర్గీకరణ చేసిన మొదటి రాష్ట్రం | బీసీ కులగణనలో దేశానికే ఆదర్శం | రోహిత్ వేముల చట్టానికి కేబినెట్ ఓకే | రాష్ట్ర సర్కార్ సంచలన నిర్ణయాలు

## రోహిత్ వేముల చట్టం



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల మరణం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆయన 2016 జనవరి 17న హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. కుల వివక్ష వల్లే రోహిత్ చనిపోయాడంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఇది పెద్ద ఉద్యమంగా మారింది. అప్పట్లోనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రెండుసార్లు హైదరాబాద్‌కు వచ్చి విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. విద్యా సంస్థల్లో కుల వివక్షకు వ్యతిరేకంగా 'రోహిత్ వేముల చట్టం' తెస్తామని మాట ఇచ్చారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లోనూ, జోడోయాత్రలోనూ దీన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

- ఈ నెల 23న రోహిత్ వేముల చట్టంపై ప్రత్యేకంగా చర్చించిన రాష్ట్ర కేబినెట్.
- చట్టాన్ని రూపొందించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు. సభ్యులుగా మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్.
- చట్టం డ్రాఫ్ట్ కోసం విధివిధానాలను రూపొందించనున్న కేబినెట్ సబ్ కమిటీ.
- త్వరలో అంతా పూర్తయి అమలులోకి రానున్న చట్టం.
- కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటకలో కూడా 'రోహిత్ వేముల చట్టం' కోసం జరిగిన ప్రయత్నాలు.

## బీసీ కులగణన

గత లోక్‌సభ ఎన్నికల్లోనైనా.. అంతకుముందు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల టైమ్‌లోనైనా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ప్రచారంలో ఎక్కువగా ఉపయోగించిన మాట 'బీసీ కులగణన'!! 'జిత్‌నీ ఆబాదీ.. ఉత్‌నా హక్'' అంటూ నినాదం ఇచ్చారు. దీన్ని 2023 ఎన్నికల మేనిఫెస్టోలోనూ కాంగ్రెస్ చేర్చింది.

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలలకు 2024 ఫిబ్రవరి 4న కేబినెట్ సమావేశమై.. కులగణన చేపట్టాలని నిర్ణయించింది.
- దీనిపై 2024 ఫిబ్రవరి 16న అసెంబ్లీలో తీర్మానం పాస్ చేసింది.
- అసెంబ్లీలో చేసిన తీర్మానానికి తగ్గట్టు అదే ఏడాది నవంబర్ 6న కులగణన సర్వే ప్రారంభమైంది. దాదాపు 50 రోజులు ఇంటింటికీ తిరిగి దీన్ని చేపట్టారు. కోటీ 12 లక్షల (97 శాతం) కుటుంబాలను సర్వే కవర్ చేసింది. తర్వాత కొందరికి ఆన్‌లైన్‌లో వెసులుబాటు కల్పించింది.
- 2025 ఫిబ్రవరి 4న కులగణన నివేదికను కేబినెట్ ఆమోదించి.. అసెంబ్లీ ముందు ఉంచింది. బీసీలు 56.36శాతం, ఎస్సీలు 17.43 శాతం, ఎస్టీలు 10.45 శాతం ఉన్నట్లు కులగణనతో తేలిందని ప్రభుత్వం ప్రకటించింది. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని, అందుకే ఈ కీలక ఘట్టాన్ని ఆవిష్కరించుకున్నామని, ఇకపై ఫిబ్రవరి 4వ తేదీని ఏటా 'సోషల్ జస్టిస్ డే'గా జరుపుకుంటామని అప్పట్లో సీఎం రేవంత్ రెడ్డి ఆనందం వెలిబుచ్చారు.
- ఈ డేటా ఆధారంగా బీసీలకు విద్య, ఉపాధి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ బిల్లులను ప్రభుత్వం తెచ్చింది.
- స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉంది. న్యాయపర సమస్యలతో గత పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అమలు కాలేదు. కానీ.. ఆ చిక్కులను తొలగించుకొని అమలు చేసి తీరుతామని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు.

## ఎస్సీ వర్గీకరణ

ఎస్సీ వర్గీకరణ అంశం మూడు దశాబ్దాల పోరాటం. ఇదే లక్ష్యంతో 1994లో ఎమ్మార్పీఎస్‌ను మంద కృష్ణ మాదిగ ఏర్పాటు చేసి ఉద్యమం నడిపారు. దీనిపై ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే.. సుప్రీంకోర్టులో కేసు క్లియర్ కాగానే ప్రభుత్వం ఓకే చెప్పింది.

- 2024 ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలని చెప్పిన సుప్రీంకోర్టు.
- సుప్రీంకోర్టు ప్రకటన వచ్చిన కొన్ని గంటల్లోనే అసెంబ్లీలో స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి. ఎస్సీ వర్గీకరణను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందని, దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని ప్రకటన.
- తర్వాత కేబినెట్ సబ్ కమిటీ, వన్ మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు. వాటి నుంచి సిఫార్సులు తీసుకున్న ప్రభుత్వం.
- 2025 మార్చి 18న అసెంబ్లీలో 'తెలంగాణ షెడ్యూల్డ్ కాస్ట్స్ (రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్స్) బిల్లు 2025'కు ఆమోదం. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ సహా అన్ని పార్టీల మద్దతు.
- అదే ఏడాది ఏప్రిల్ 1న అంబేద్కర్ జయంతి సందర్భంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ. 3 గ్రూపులుగా ఎస్సీల విభజన.. రిజర్వేషన్ల కేటాయింపు. గ్రూప్-I (15 కులాలు): 1%, గ్రూప్-II (18 కులాలు): 9%, గ్రూప్-III (26 కులాలు): 5% రిజర్వేషన్లు.

